
# రసజ్వాల

## శైలకుమార్



**కిటికీలోంచి** పడుతున్న వెన్నెలను చూస్తూ నిలుచున్నాడు వినయ్. అర్ధరాత్రి నిశ్శబ్దం ఒడిలో ఆదమరిచి నిద్రపోతోంది మద్రాసు నగరం. అతడిలో ఏదో అశాంతి. అంతరంగాన్ని కల్లోల పరుస్తున్న భావన.

అసహనంగా కదిలి డాబా మీద వెన్నెల్లోకి వచ్చి సిగరెట్ వెలిగించుకున్నాడు వినయ్. డాబా మీద తెల్లని తివాచీలా పరుచుకున్న వెన్నెల. శరీరాన్ని చల్లగా తాకుతున్న పిల్లగాలి. మేఘంలా గాలిలో దూసుకుపోతున్న సిగరెట్ పొగ. అతడి మనసులో మవునంగా ఉన్న కోరికల కొలనులో రాయిలా వచ్చి పడింది ఆ ఉత్తరం. ఉదయం వచ్చిన ఆ ఉత్తరమే అతడిని కల్లోల పరుస్తోంది.

డాబామీద పిట్టగోడపై కూర్చున్నాడు వినయ్. ఇన్నాళ్ళూ పగ్గాలు వేసి ఉంచిన వయస్సు మనసు మీద తిరుగుబాటు చేస్తోంది. సిగరెట్ విసిరేశాడు. దూరంగా ఆవుల మెడలోని గంటలు మోగుతున్న శబ్దం. ఎక్కడినుంచో నైట్ క్వీన్ పరిమళపు అల.

లేచి అటూ ఇటూ, పచార్లు చేయసాగాడు వినయ్. గాలికి కదిలిన చెట్ల ఆకుల సవ్వడి. వెన్నెలను తాగి మత్తుగా జోగుతున్న ఆకులు.

"మాలతీ..." అప్రయత్నంగా ఉచ్చరించాయి ఆ పేరుని అతని పెదాలు. ఆమె రూపం లీలగా అతని కళ్ళ ముందు కదలాడింది. వెంటనే మళ్ళీ గుర్తు వచ్చింది ఆమె ఉత్తరం. అందులోని ప్రతి వాక్యం ఆమె ఎదురుగా నిలబడి మాట్లాడుతున్నట్టే ఉంది.

"వినయ్‌గారూ,

'వనిత తనంత తా వలచి వచ్చిన' ... అన్నట్టుగానే మీరూ ప్రవర్తించారు. నాకు బాధగా లేదు, నిర్లిప్తత తప్ప. మీ మీద కోపంగానూ లేదు నా మీద నాకు తప్ప. అంతగా బయటపడి ఉండకపోతే బాగుండునన్న భావన మిగిలింది.

హృదయం రస స్పందనతో నిండి, ఒక్క క్షణం బలహీనపడి తొణికిన ఘడియ అది. దాన్ని గుప్తంగా గుండెలో దాచుకోవలసింది పోయి, సందేహాలతో చల్లబరిచారు. అనురాగానికి ఎదురైన అవమానం. మనిషికి మరో మనిషి దగ్గర కావటానికి అంతకన్నా మరో మార్గం లేకపోవటం చేతే తప్ప, కేవలం 'మగవాడు' కావాలని మాత్రం కాదు. మగవాడే కావాలనుకుంటే నే నంత దూరం రావలసిన అవసరమూ లేదు. 'నిన్ను తాకగలను, చేత్తో స్పృశించగలనే కాని,

నిన్ను నిన్నుగా నాలో ఐక్యం చేసుకోలేనే' అన్న చలం మాటలు మీకు గుర్తుచేస్తే తప్పు లేదనుకుంటాను.

రచయిత అని అన్నారు గానీ, జీవితంలో జనించిన కవిత్వాన్ని అందుకోలేకపోయారు. అనురాగంతో దగ్గరై, అలసిన శరీరాన్ని అక్కున చేర్చుకుని, మాసిన వీణా తంత్రుల్ని మీటి, ఆ రవళితో ఆనందంతో మూర్ఛిల్లేట్లు చేయవలసింది పోయి, అనుమానాలతో రసభంగం చేసి, అవమానం నిండిన హృదయంతో నన్ను వెనక్కి పంపారు.

ఇదంతా మిమ్మల్ని బాధ పెట్టాలని కాదు. నా మీద మీకు ఏర్పడిన 'ఆ' భావాన్ని తొలగించ టానికి మాత్రమే!

—మాలతి."

ఇంకో సిగరెట్ వెలిగించాడు వినయ్. మరింత చల్లబడింది గాలి. ఆమెతో పరిచయం గుర్తుకు రాసాగింది అతడికి.

● ● ● ●

ఉదయభానుడు ఆకాశ పథంలోకి అడుగు పెట్టాలా, వద్దా అని ఆలోచిస్తున్న సమయం. మంచు బిందువుల్లో స్నానం చేసిన గడ్డి పరకలు ప్రక్షాళిత దేహంతో సంతోషంగా తల ఊపుతున్న తరుణం.

సెంట్రల్ స్టేషన్ బుకింగ్ కౌంటరు వరం డాలో సూట్‌కేస్ మీద కూర్చుని పేపరు చదువు కుంటున్నాడు వినయ్.

"బెజవాడకు టికెట్లివ్వటం లేదాండి?"

చదువుతున్న పేపర్ని పక్కకు తీసి తలెత్తి చూశాడు వినయ్. ఎదురుగా వో స్త్రీ. ఆమె తననే అడుగుతోందన్న భావాన్ని గ్రహించి "మీ రే ట్రెయిన్‌కు వెళ్ళాలండి?" అనడిగాడు.

"కోరమాండల్‌కు."

"నేనూ అదే రైలుకు వెళ్ళాలి. కానీ బుకింగ్ క్లర్కు టికెట్లివ్వ నంటున్నాడే" అన్నాడు.

"ఎలాగండి? నేను అర్జెంటుగా బెజవాడ వెళ్ళాలే" అంది, ఎలాగైనా టికెట్లు సంపాదించు అన్న ధోరణిలో.

"నేనూ అర్జెంటుగానే వెళ్ళాలి. కానీ ఏం చేస్తాం చెప్పండి, కోరమాండల్‌లో జనరల్ బోగీ ఒక్కటే ఉంటుంది" అన్నాడు వినయ్.

"అయ్యో! ఎలాగండి మరి?" నిరాశగా అంది.

ఒక్కసారి ఆమె ముఖంలోకి చూసి "ఉండండి ప్రయత్నిం చేద్దాం. రైలుకు ఇంకా చాలా టైముంది" అని బుకింగ్ కౌంటరు వైపు కదిలాడు వినయ్.

కొద్దిసేపటికి రెండు టికెట్లు పట్టుకుని ఆమె దగ్గరకు వచ్చాడు.

"మొత్తానికి టికెట్లు సంపాదించాను అయిదు రూపాయలు ఎక్కువిచ్చి" అంటూ ఆమె టికెట్‌ను ఆమెకు ఇచ్చాడు వినయ్. సంతోషంతో టికెట్ అందుకుని, డబ్బు అతనికి ఇచ్చి "చాలా థాంక్సండీ" అంది ఎంతో నిజాయితీగా.

టికెట్ తీసుకుని కూడా అక్కడే నిలబడటంతో ఆమెను పరిశీలించక తప్పలేదు వినయ్‌కు. ఇరవై, ఇరవై రెండేళ్ళ మధ్య ఉన్న వయస్సు. మామూలు స్త్రీ ఎత్తుకన్నా కాస్త పొట్టి, నల్లని శరీరఛాయ. కొద్దిగా ముందుకు వచ్చిన పొట్ట, అవయవాల పొందిక లేని ఆకారం, నల్లని మొహం మీద తెల్లగా పౌడరు, బేలగా చూసే కళ్ళు, ఒంపు తిరిగిన పెదవులు తప్ప ఆమెలో ఇంకే ఆకర్షణా లేదనుకున్నాడు వినయ్. ఆమె చూపుల్లో చూపులు కలిశాయి. చటుక్కున కళ్ళు దించుకున్నాడు తప్పు చేసినవాడిలా!

"టిఫిన్ చేశారా?" అడిగాడు ఏదో ఒకటి మాట్లాడాలని.

"లేదండి" అంది.

"మీ కభ్యంతరం లేకపోతే కాంటీన్ కెళదాం, రండి. రైలు బయలుదేరటానికి ఇంకా గంట టైముంది" అని సూట్‌కేస్ చేతిలోకి తీసుకుని కదిలాడు. ఆమె కూడా అతడిని అనుసరించింది.

ఆమె రాదనుకుని పిలిచాడు వినయ్. కానీ ఆమె రావటంతో అతనిలో కొంత చికాకు కలిగింది, అస లేమిటి ఈవిడ ఉద్దేశం అన్న సందేహంతోపాటు.

ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు. తానే టిఫిన్ తీసుకొచ్చాడు వినయ్. మౌనంగా టిఫిన్ చేయసాగారు.

"మీ పేరు?" అడిగింది, వంచిన తల కొద్దిగా ఎత్తి.

"వినయ్."

"ఏం చేస్తున్నారు?"

"ఇక్కడే సి. ఎ. చేస్తున్నాను. అర్జెంటుగా రమ్మని మా నాన్నగారు ఉత్తరం రాయటంతో విజయవాడ బయల్దేరాను. అటునుంచి సూర్యాపేట వెళ్ళాలి" అన్నాడు చెయ్యి కడుక్కుంటూ.

"నా పేరు మాలతి. మహాబలిపురం ప్రక్క వూర్లో స్టాఫ్ నర్సుగా పని చేస్తున్నాను" అంది అతను అడక్కుండానే.

"అలాగా!" అన్నాడు వినయ్.

అతను ఆమె గురించి ఏమీ అడగక పోవటంతో కాస్త చిన్నబుచ్చుకుంది.

"ఈ రోజు మీ సహాయానికి చాలా థాంక్సండీ" అంది మళ్ళీ.

"అబ్బే! నేను చేసిందేముంది" అన్నాడు మొహ మాటంగా.

"అపరిచితురాలికి అందరూ సహాయం చేస్తారు" అంది వోరగా చూసి, మెల్లగా నవ్వుతూ.

"పరిచితులకే సహాయం చెయ్యాలని లేదు గదండి." తనూ నవ్వుతూ అన్నాడు. ఆమె టిఫిన్ తినటం పూర్తిచేసింది.

"ఇంతకూ టికెట్ విషయం మీకు నన్నే అడగా లని ఎందు కనిపించింది?" అడిగాడు కుతూహలంగా వినయ్.

"తెలుగు పేపర్ చదువుతూ కనిపించారు. బహుశా తెలుగువారై ఉంటారని అడిగేశాను" అంది. నవ్వుతూ కుర్చీలో వెనక్కి వాలి.

నవ్వుతున్నప్పుడు ఆమె బుగ్గలు సొట్టలు పడు తున్నాయి. నవ్వినప్పుడు సొట్టలు పడే బుగ్గలతో, తెల్లని పలువరుసతో కాస్త అందంగా కనిపిస్తోంది అనుకున్నాడు.

"రైలు దగ్గరికి వెళదాం రండి. మళ్ళీ సీటు దొరక్క పోతే చాలా ఇబ్బంది" అని లేచాడు వినయ్.

ఇద్దరూ కోరమాండల్ ఉన్న ప్లాట్‌ఫారం దగ్గ రకు వచ్చారు. విపరీతంగా జనం ఉన్నారు. జనరల్ బోగీకి ఆ చివర, ఈ చివర ఉన్న తలుపుల్లో ఒకదాని నుండి మగవాళ్ళు, మరోదాని నుండి ఆడవాళ్ళు లోపలికి వెళుతున్నారు క్యూ పద్ధతిలో. డోరుదగ్గర నిలబడ్డ కండక్టరు ఎక్సెస్ ఫేర్ రాసి ఇస్తున్నాడు అందరికీ. కొండవీటి చాంతాడుకన్నా పొడుగ్గా ఉంది మగవాళ్ళ క్యూ. క్యూలో నిలబడి లోపలికి వెళితే సీటు కాదు కదా, కాలు పెట్టడానికి చోటు కూడా దొరక దనుకున్నాడు వినయ్. ఆడవాళ్ళ క్యూ వైపు చూశాడు. అయిదారు మంది కంటే ఎక్కువ లేరు అక్కడ. వెంటనే అతడి కో ఆలోచన వచ్చింది.

"మాలతిగారూ! నా కో సహాయం చేస్తారా?" అడిగాడు, ఆడవాళ్ళ క్యూ వైపు వెళుతున్న ఆమెను.



"చెప్పండి" అంది ఆమె ఆగి.

"మీకు అభ్యంతరం లేకపోతే, నాకో సీటు అట్టి పెడతారా" అన్నాడు బిడియంగా.

"అలాగే" అంటూ అతని చేతిలోని సూట్‌కేస్‌ను తీసుకోబోయింది.

"అబ్బే! ఎందుకండీ శ్రమ?" వారించాడు

"పరవాలేదు." చొరవగా అని, అతని చేతిలోని సూట్‌కేస్‌ను బలవంతంగా తీసుకుని నవ్వింది.

ఎట్టకేలకు మనుష్యులను తోసుకుని ఎక్కగలిగాడు వినయ్ ఆ కంపార్ట్‌మెంటు లోకి. మాలతికోసం వెతికాడు. కిటికీకి, తనకీ మధ్య సూట్‌కేస్‌ను ఉంచి అతని కోసం ఎదురు చూస్తోంది ఆమె. నలుగురు కూర్చోవలసిన ఆ సీటులో అప్పటికే ఆరుమంది కూర్చుని ఉన్నారు. సూట్‌కేస్ పెట్టిన ఆ కాస్త జాగాలో ఎలా కూర్చోవాలా అని ఆలోచనలో పడ్డాడు.

"రండి, కూర్చుందురు కాని..." పిలిచిం దామె, సూట్‌కేస్‌ను తీసి సీటు కింద పెడుతూ.

చిన్నపిల్లవాడికి తప్ప ఆ జాగా తనకు సరిపోదు. ఎలా కూర్చోవాలి అనుకున్నాడు.

"మిమ్మల్నే..." మళ్ళీ పిలిచింది.

ఇక తప్పదని వెళ్ళి ఒదిగి ఒదిగి కూర్చున్నాడు ఆ జాగాలోనే. అప్పటికే సగం శరీరం ఆమె పైన ఉంది. ఇబ్బందిగా అనిపించింది వినయ్‌కు.

"ఏం ఆలోచిస్తూ నిలబడ్డారు అంతసేపు? నా పక్కన కూర్చోవాలనా?" కొంటెగా అడిగింది. ఆమె ముఖం అతనికి చాలా దగ్గరగా ఉంది.

"మీ కేమైనా ఇబ్బంది కలుగుతుందేమోనని..." తడబడ్డాడు.

"మీరు కూర్చోక పోతేనే ఇబ్బంది పడేదాన్ని." సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ అంది.

"వూ" అన్నాడు దీర్ఘం తీస్తూ.

"ఇంకెవరైనా కూర్చుంటా రేమోనని" అంది తల వంచి తడబడుతూ.

మెల్లగా బయలు దేరిన రైలు స్పీడందుకుంది. పట్టాలపై కదులుతున్న చక్రాల లయబద్ధ సంగీతం. వూయలలా కదులుతున్న బోగీ. కిటికీలోంచి చల్లని గాలి.

"చూసే వాళ్ళు మనల్ని భార్యా భర్త అనుకుంటారు కదూ!" చెవి దగ్గర మొహం పెట్టి గుసగుసగా అంది.

ఆశ్చర్యం వేసింది వినయ్‌కు ఆమె ఆ మాట అన్నందుకు. ఏమి టీవిడ మనస్తత్త్వం? కావాలనే కవ్విస్తూ ఉందా? ప్రయత్నిస్తే లొంగిపోయేలా ఉంది అనుకుని "మీకు పెళ్ళయిందనుకుంటాను" అన్నాడు తనూ స్వరం తగ్గించి.

"అయింది తొమ్మిది నెలల క్రితం" అంది బరువుగా వూపిరి వదులుతూ, చేతిలోని గీతలు చూసుకుంటూ. ఆమె నిశ్వాసపు వేడిగాలి అతని చేతిని తాకింది.

"మీ వా రేం చేస్తున్నారు?"

"గుంటూరు పి అండ్ టి లో పని చేస్తారు.




మా అత్తగారికి బాగా లేదని టెలిగ్రామ్ వచ్చింది. ఇప్పు డక్కడికే ప్రయాణం" అంది.

ఆమె ముఖం మీద ఏదో విషాదపు తెర కమ్ముకున్నట్లు అనిపించింది వినయ్‌కు. సూట్‌కేస్ నుండి వీక్లీ తీసి అందులో నిమగ్నమయ్యాడు. రైలు పోతూ ఉంది. ఎవరి గొడవల్లో వాళ్ళు. ఒక్కొక్కరిదీ ఒక్కో ప్రపంచం.

మెత్తని స్పర్శ, మత్తైన స్పర్శ, నరాల్ని తీగెలను చేసి నాదాలు పలికిస్తున్న స్పర్శ, సృష్టి స్థితిని ప్రశ్నించి వింతైన విద్యుత్తును సృష్టిస్తున్న స్పర్శ, మనసును భావంగా, శరీరాన్ని రాగంగా మారుస్తున్న స్పర్శ, ఆదినుంచి మానవుడిని ఆనంద ఉన్మాదంలో పడేసిన స్పర్శ, ఆర్తి నిండిన అనురాగపు స్పర్శ. వీక్లీని మడిచి చూశాడు. ఆమె శరీరం అంతా అతడిని ఆనుకుని ఉంది. అతని వక్షంపై ఆమె తల పెట్టి నిద్రపోతూ ఉంది. అతడి శరీరాన్ని స్పృశిస్తున్న ఆమె ఉచ్ఛ్వాస, నిశ్వాసాల సవ్వడి. అతడి నాసికను తాకుతున్న ఆమె ధమ్మిల్లపు పరిమళం.

సంస్కారం జోల పాడుతున్నా కోరిక నిద్ర లేస్తూ ఉంది అతడిలో. ఆమెను ఎలా లేపాలో తెలియక అసహనంగా అటూ, ఇటూ కదిలాడు. ఆమె లేచి "సారీ, రాత్రంతా డ్యూటీ చేయటంతో నిద్ర పట్టింది" అంది.

అత డేమీ మాట్లాడలేదు. మళ్ళీ వీక్లీలో మునిగి పోయాడు. కొద్ది సేపటికి తిరిగి అదే స్పర్శ. అనుమానం ప్రవేశించింది వినయ్‌లో. ఈసారి ఆమెను నిద్ర లేపే ప్రయత్నం మాని, ఆమెనే గమనించ సాగాడు. ఆమె నిద్ర పోవటం లేదు— నిద్రనే నటిస్తోంది.

ఆమెను పరీక్షించా లనుకుని, తన కాలి మీద ఉన్న ఆమె చేయిపై చేయి వేశాడు. వెంటనే అతడి చేతిపై ఆమె పైట కొంగును కప్పింది. ఆ చేతుల కలయిక మరెవ్వరికీ కనిపించరాదని. ఆమె చేతిలో నలిగిపోతున్న అతడి చెయ్యి, అతడిలో గట్లు తెగుతున్న ప్రవాహం, హృదయంలో మింటి కెగుస్తున్న అల, నరాల దారుల్లో నయాగరా ఉద్ధృతి.

విజయవాడలో ఆగింది కోరమాండల్. వినయ్, మాలతి దిగారు. గుంటూరు వెళ్ళే పాసెంజరు, సిద్ధంగా ఉందని అనౌన్స్‌మెంటు వినిపించింది. ఏదో చెప్పబోయాడు వినయ్.

"పాసెంజర్‌లో ప్రయాణం చాలా బోరండీ. మీతో పాటు బస్‌స్టాండుకు వచ్చి బస్సెక్కుతాను" అంది.

వ్యంగ్యంగా నవ్వి 'అలాగే' అన్నాడు వినయ్. ఇద్దరూ రిక్షాలో బస్‌స్టాండుకు వచ్చారు.

"ఆకలిగా ఉంది. కాస్త టిఫిన్ చేద్దాం రండి" అంటూ మనోరమ లోకి దారి తీసింది. ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు. ఆమె టిఫిన్ ఆర్డర్ చేసింది.

"మీరు మళ్ళీ మద్రాసు ఎప్పుడు వెళతారు?" అడిగింది.

"బహుశా రెండు, మూడు రోజుల్లో."

"నేను ఆదివారం ఉదయం సర్కారుకు వస్తాను. స్టేషనుకు రాకూడదూ?" అంది అభ్యర్థిస్తున్నట్లు.

"ఎందుకూ?"

ఒక్క క్షణం మౌనంగా ఉండి, "మహాబలిపురం వెళ్ళే బస్సులు ఎక్కడ ఆగుతాయో నాకు తెలీదు. పైగా అరవ భాష రాదు. మీరుంటే తోడుగా ఉంటారని.


"అంత పొద్దున్నే నేను లేచి రాలేను. కావాలంటే మీరే మా రూముకు రండి. మిమ్మల్ని బస్సెక్కిస్తాను" అన్నాడు.

"మీ రూమెక్కడ?" అడిగింది. చెప్పాడు.

"ఒక్కరే ఉంటున్నారా?" వోరగా చూస్తూ అంది.

"లేదు—ఇంకో స్నేహితుడున్నాడు."

ఆమె అడ్రసు రాసిన కాగితాన్ని వినయ్‌కు ఇచ్చి గుంటూరు బస్సు ఎక్కింది. భర్తకు దూరంగా ఉండటం వల్ల కలిగిన క్షణికోద్రేకం కావచ్చు, లేదా



తిరుగుబోతుకావచ్చు అనుకున్నాడువినయ్ సూర్యాపేట బస్సులో కూర్చుని.

మరో రెండు రోజుల్లో మద్రాసు చేరుకున్నాడు. ఆ రోజు ఆదివారం కావటంతో ఆలస్యంగా నిద్ర లేచి,తాపీగా స్నానంచేసి పేపర్ చూస్తూ కూర్చున్నాడు వినయ్. ఇంతలో బజర్ మోగింది. వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా మాలతి. ఒక్క క్షణం ఆశ్చర్య పోయి, అంతలో తేరుకుని ఆమెను ఆహ్వానించాడు.

"ఇంత మంచి ఫ్లాట్‌ను రూమని చెప్పా రేమిటి" అంది సూట్‌కేస్ కింద పెడుతూ.

"మాకు ఫ్లాట్ అయినా, రూమైనా ఒకటే కదండీ, అన్నాడు నవ్వుతూ.

"హోహో! బాగా అలిసిపోయాను" అంది కుర్చీలో కూర్చుంటూ.

"స్నానం చేయండి అలసట పోతుంది" అన్నాడు.

మరి కొద్ది సేపట్లో ఆమె స్నానం చేసి,దుస్తులు మార్చుకుని వచ్చింది. ఆమె అలా ఏకంగా రూముకే వచ్చేస్తుందని అనుకోలేదు వినయ్. ఏదో మాట వరసకు అన్నాడు తప్ప, ఆమె రావాలని అతడు కోరుకోలేదు. ఆమెపై ఉన్న తేలిక భావం మరింత బలపడింది వినయ్‌లో ఆమె అలా రావటం వల్ల.

"మీ అత్తగారి కెలా ఉంది?" ఆ విషయం జ్ఞాపకం వచ్చి అడిగాడు.

"బాగుంది. మీ రూమ్‌మేట్ ఎవరో ఉండా లన్నారు" అంది మాట మారుస్తూ.

"వీరరాజని... బయటి కెళ్ళాడు. మరి కొద్ది సేపట్లో రావచ్చు" అన్నాడు ఆమెనే గమనిస్తూ వినయ్.

నిర్భయంగా కుర్చీలో వెనక్కి వాలి, స్వేచ్ఛగా మాట్లాడేస్తూంది. స్నానం చేసిన ఆమె శరీర పరిమళం ఫానుగాలికి రూమంతా అల్లుకు పోతూంది. వినయ్ లేచి వంట ఇంట్లోకి వెళ్ళి, కాఫీ కలిపి తీసుకు వచ్చాడు.

"ఎందుకండీ శ్రమ! చెబితే నే కలిపేదాన్నిగా" అంది కప్పు అందుకుని లాలనగా చూస్తూ.

"ఇందులో శ్రమేముంది? నేనూ తాగుతున్నానుగా" అన్నాడు ఆమె చూపుల నుంచి తప్పించుకుంటూ.

"మీరు కష్టపడటం నా కిష్టం ఉండదు."

"అంటే మీ కిష్టమైన పనులే నేను చెయ్యాలా" అన్నాడు వ్యంగ్యంగా. తాగిన కాఫీ కప్పుల్ని ఆమే తీసుకు వెళ్ళి కడిగింది. అతడు వారిస్తున్నా వినకుండా.

"ఎప్పుడు బయలు దేరదాం?" అడిగింది మాలతి.

"మీ ఇష్టం" అన్నాడు.

"అయితే మరో గంటలో వెళ్ళిపోదాం. బట్టలు సర్దుకోండి" అంది కాస్త ఆనందంగా.

"నేను బట్టలు సర్దుకోవటమేమిటి?" అడిగాడు వినయ్ సీరియస్‌గా.

కోపం వచ్చినట్లు అతని మొహంలోకి చూసి, తల కొద్దిగా దించుకుని "ఈ రోజు మహాబలిపురంలో గడుపుదాం. రేపొద్దున్నే మీ రిటు వచ్చేద్దురు కానీ. నే నటు డ్యూటీకి మా వూరు వెళతాను." అంది. తనకేం కావాలో, అతడి నుంచి తనేం కోరుతూందో స్పష్టంగా చెప్పేసింది మాలతి.

మాలతిని ఎగా దిగా చూశాడు వినయ్. 'ఒక స్త్రీ ఇంత ఇదిగా ఆడుగుతుందా!' అనుకున్నాడు. ఆ నాడు తా ననుకున్నట్లు ఆమెది క్షణికోద్రేకం కాదనిపించింది.

"మహాబలిపురానికి నే నెందుకు?" ఏమీ తెలీనట్లు అడిగాడు. విస్తుపోయింది మాలతి ఆ ప్రశ్నకు. మెల్లిగా లేచి కిటికీ దగ్గర నిలబడి బయటికి చూస్తూ, "అర్థం చేసుకోలేనంతటి పసిపిల్లలు కాదను కుంటాను" అంది.

"అర్థం చేసుకున్నాను కాబట్టే అనవసరం అనుకుంటున్నాను" అని విసురుగా లేచి లోపలి గది లోకి వెళ్ళాడు వినయ్.

ఒక్క క్షణం నిశ్చేష్ట అయింది మాలతి. ఆ తరవాత మెల్లగా లోపలకు వెళ్ళి, ఏవో పుస్తకాలు చూస్తూ ఉన్న వినయ్‌ను బుజ్జగిస్తున్నట్లు తన వైపుకు తిప్పుకుని కళ్ళలోకి చూస్తూ, "అనవసరమా వినయ్? హృదయానికి స్పందన, ప్రకృతికి సృష్టి అనవసరమా? ఒక మనిషి మరో మనిషి నుండి లాలన, ప్రేమ, రససిద్ధి కోరు కోవటం అనవసరమా? అలా అయితే ఈ విశ్వానికే అర్థం లేదు" అంది.

ఆ కంఠంలోని మార్దవానికి కరిగి పోతానేమో అనుకుంటూ ఆమెకు దూరంగా జరిగాడు వినయ్.

"మాలతీ! పెళ్ళయిన నువ్వు ఇలా ప్రవర్తించ టం" కోపంగా అన్నాడు.

"పెళ్ళయిన స్త్రీకి మనసుండదా, వినయ్!"తాపీగా, శాంతంగా అంది మాలతి.

"కానీ నీకు భర్త ఉన్నాడుగా!" అన్నాడు విసుగ్గా.

"ఒక స్త్రీ మనసంతాఆక్రమించుకున్న పురుషుడు ఆమె హృదయ పూర్వకంగా కోరుకుంటున్న పురుషుడు ఆమెకు భర్త కాడా, వినయ్!" అడిగింది. ఎలాగైనా అతడిని ఒప్పించి తన వాడిని చేసుకోవాలని.

వాదనలో ఆమెను జయించలే ననుకున్నాడు వినయ్.

"వాదన వద్దు. ఏది ఏమైనా అది తప్పు" అన్నాడు.

"తప్పా!" నవ్వింది. ఏం చెయ్యాలో తోచలేదు వినయ్‌కు.

"నువ్వు తప్పనుకున్నా, నాకు తప్పించుకోవాలని లేదు" అంది.

ఆమె కళ్ళల్లోకి చూశాడు వినయ్. ఈమెది సిన్సియారిటీ అనుకోవాలా, విశృంఖలత్వం అనుకోవాలా అని.

ఇంతలో బజర్ మోగింది. వీరరాజు వచ్చాడు. మాలతిని పరిచయం చేశాడు వినయ్. అంతకు ముందే ఆమెని గురించి వినయ్ చెప్పి ఉండటం వల్ల వీరరాజు ఆశ్చర్యపోలేదు.

ముగ్గురూ భోజనాలు చేశారు. మాలతి లోపలి గదిలో పుస్తకాలు చూస్తూ కూర్చుంది. సాయంత్రం అయింది.

వినయ్ లోపలి గదిలోకి వచ్చాడు. ఆమె తలెత్తి వినయ్‌ను చూసింది. వీక్లీలోకి ఒక కథను చూపిస్తూ, "ఇది మీరు వ్రాసిందేనా?" అని అడిగింది.

"అవును" అన్నాడు.

"చాలా బాగుంది."

"థాంక్స్" అన్నాడు.

"బస్సెక్కించే మంటావా, మాలతీ!" అన్నాడు,




ఆమె తిరిగి ఏదో మాట్లాడబోయేంతలో.

"ఇప్పుడు వెళితే నేను వూరు చేరేటప్పటికి చాలా రాత్రవుతుంది. పొద్దున్నే వెళతాను, మీ కభ్యంతరం లేకపోతే" అంది లేచి నిలబడి.

"అలాగే" అని బాట్ తీసుకుని షటిల్ ఆడటానికి వెళ్ళాడు వినయ్. అతనితోపాటు వీర్రాజూ బయలుదేరాడు. ఒంటరిగా మిగిలింది ఆ ఇంట్లో మాలతి. నిట్టూర్చింది.

రాత్రి మాలతికి లోపలి గదిలో పక్క ఏర్పాటు చేసి, ముందు గదిలో పడుకున్నారు వీర్రాజూ, వినయ్. సాయంత్రం బాగా ఆడి, అలిసి పోవడంతో ఇద్దరికీ గాఢ నిద్ర పట్టేంది.

అర్ధరాత్రి ఏదో స్పర్శకు మెలుకువ వచ్చింది. వినయ్‌కు. కళ్ళు తెరిచి చూశాడు. అతని తల దగ్గర కూర్చుని. అతని జుట్టు లోనికి వేళ్ళు జొనిపి, లాలనగా నవరిస్తూ ఉంది మాలతి. పక్కకు చూశాడు, వీర్రాజు గాఢ నిద్రలో ఉన్నాడు.

"ఏమిటిది, మాలతీ! వీర్రాజు లేస్తే ఏమను కుంటాడు?" అన్నాడు మెల్లగా విసుగ్గా లేచి కూర్చుని.

"నిద్రరావటం లేదు. కాసేపు అక్కడికి వచ్చి కూర్చుని ఏమైనా కబుర్లు చెప్పు" అంది మత్తుగా.

తప్పదన్నట్లు లేచి లోపలి గదిలోకి వచ్చాడు. మసక మసక వెలుగు. ఒకరి వూపిరి శబ్దం మరొకరికి వినిపించేంత నిశ్శబ్దం.

దిండు వేసుకుని గోడకు ఆనుకుని కూర్చున్నాడు వినయ్. అతని ఒడిలో తల పెట్టి పడుకుంది మాలతి. వారించా లనుకున్నా వీలు కాలేదు వినయ్‌కు.

"ఏమిటిది, మాలతీ?" అన్నాడు చిరాగ్గా.

"రసికుడవై ఉండీ అర్థం చేసుకోలేక పోతు న్నావు కదూ?" అంది. అతని తలపై చేయి వేసి, ముఖాన్ని దగ్గరకు లాక్కుని, అధరాలను అందుకోవ టానికి ప్రయత్నం చేస్తూ.

"నో! నా కిష్టంలేదు" అన్నాడు కోపంగా ముఖం తప్పించి.

ఆ మసక మసక వెలుగు, మత్తైన ఆమె స్వరం, మెత్తగా తగులుతున్న స్త్రీ స్పర్శ అతడి ఉద్రేకాన్ని రెచ్చగొడుతోంది. కానీ ఏదో పట్టుదల ఈమెకు లొంగిపోకూడదని.

"ఇష్టంలేనిది ఏది, వినయ్! నేను అందంగా లేక పోవటమా? లేక ఇలా బరితెగించి నీ దగ్గరికి రావటమా?" అడిగింది లాలనగా.

రెండూ అనబోయి, అనలేక మౌనంగా ఉండి పోయాడు వినయ్. అతడు కరుగుతున్నాడని గ్రహిం చింది.

"వినయ్! నువ్వు నాక్కావాలి. నీ సంస్కారం, మంచితనం నన్ను ఆకట్టుకుని మొదటిసారిగా నీ పట్ల బలహీనపడేట్లు చేశాయి. ఐ నీడ్ యు ప్లీజ్" అంటూ అతడిని పూర్తిగా పెనవేసుకుంది.

పట్టుజారిపోతున్న స్థితి, సడలుతున్న నిగ్రహం. "నో" అని విదిలించి కొట్టాడామెను వినయ్. పరుపుపై వెల్లకిలా పడింది మాలతి. లేచి ముందర రూములోకి వెళ్ళిపోయాడు వినయ్.

వెక్కి వెక్కి ఏడ్చింది దిండు తడిసిపోయేలా మాలతి. గుండె నుండి స్రవించిన వెచ్చని కన్నీటి చుక్కల్లో ఆమె కోరిక, భావుకత, స్పందన అన్నీ దగ్ధమయ్యాయి.

ఉదయాన్నే వెళ్ళిపోయింది ఆమె. వెళ్ళిన వారం రోజులకు వచ్చిందా ఉత్తరం.

• • • •

మరో సిగరెట్ వెలిగించాడు వినయ్. తెలతెల వారుతోంది. ఒక నిర్ణయానికి వచ్చినట్లు గబగబా డాబా దిగి, ఇంట్లోకి వెళ్ళి బట్టలు సర్దుకోసాగాడు.

ఆ చప్పుడుకి లేచిన వీర్రాజు బాగ్‌తో బయలు దేరబోతున్న వినయ్‌ని చూసి, "ఎక్కడికిరా?" అని అడిగాడు.

"మాలతి దగ్గరికి ..."

ఆశ్చర్యపోయాడు వీర్రాజు. "నిన్నటిదాకా అంద గత్తె కాదని అసహ్యించుకున్నావు" అన్నాడు సందే హంగా.

"అందం ఉండేది ఒక్క శరీరంలోనే కాదన్న విషయం తెలిసి..." అని వెళ్ళిపోయాడు వినయ్.

సాయంత్రం ఇంటి ముందు ఒంటరిగా కూర్చుని ఏదో ఆలోచిస్తున్న మాలతి, అనుకోకుండా వినయ్ రావటం చూసి కొద్దిగా ఆశ్చర్యపోయింది.

"బాగున్నావా, మాలతీ!" అడిగాడు ఇంట్లోకి వస్తూ వినయ్.

"శారీరకంగానే అయితే చాలా బాగున్నాను" అంది బరువుగా. కాఫీ ఇచ్చింది. తాగాడు. స్నానం చెయ్యమని నీళ్ళు పెట్టింది. చేశాడు. వంట ప్రారంభించింది. అన్ని పనులూ యాంత్రికంగా చేసుకుపోతున్న ఆమెను చూస్తూ ఆలోచనలో పడ్డాడు వినయ్.

భోజనాల తరవాత అతనికి మంచం మీద పరుపు వేసి, తను దూరంగా చాప వేసుకుని పడుకుంది మాలతి.

దూరంగా ఉన్నా, ఆమె తలలోని మల్లెల పరిమళం అతణ్ణి ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. నిశ్శబ్దం అలముకుంటున్న రాత్రి...

"నా మీద ఇంకా కోపంగా ఉందా, మాలతీ?" అడిగాడు మార్దవంగా.

"మీ మీద నాక్కోపం ఎందుకండీ" అంది నిర్లిప్తంగా మాలతి.

"మరి అంతదూరం ఉండిపోయావు?" కొంటెగా అన్నాడు వినయ్.

"దగ్గరకి రాలేక పోయాను కాబట్టి ..." అంది.

మంచం మీద నుండి లేచి ఆమె దగ్గరకు వచ్చాడు వినయ్. ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. బలంగా తన కౌగిలిలో ఇముడ్చుకుని అధరాలు అందుకోబోయాడు. కొండమీద నుండి కిందికి దూకుతున్న జలపాతం లాంటి కోరిక అతనిలో.

"వద్దు, వినయ్." కఠినంగా అని విడిపించు కుంది మాలతి.

విస్తుపోయాడు వినయ్.

"నీ స్పర్శలో అనురాగం కాక, ఆ నాడు నీవు చేసిన అవమానమే గుర్తుకు వస్తోంది. హృదయం కాలి మసై పోయింది ఆ నాటి ఆ బాధకు. మరో స్త్రీ అయితే ఆ అవమానానికి ఆత్మహత్య చేసుకుని ఉండేది." కాస్త ఆగింది మాలతి ...

"అదంతా మరచి, ఈ రోజు ఏమీ జరగనట్టు నన్ను నేను నీకు అర్పించుకోలేను, వినయ్! నేను కోరుకునేది కేవలం శరీరాన్నే కాదు. సారీ! వెళ్ళు." అంది విసురుగా.

బొమ్మలా నిలబడిపోయాడు వినయ్. *